వైద్య సేవలు అందక రోగుల అవస్థలు

- రెండు పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత
- గత ప్రభుత్వంలో ప్రత్యేక వైద్యులు.. ఇప్పుడు ఏరి?
- ల్యాబ్ టెక్నీషియన్లు డిప్యూటేషన్
- నైట్ వాచ్‌మెన్ పోస్టులు ఖాళీ


డ్రెస్సింగ్ కోసం ఎదురు చూస్తున్న రోగులు


ల్యాబ్ టెక్నీషియన్‌కు బదులు పరీక్షలు నిర్వహిస్తున్న హెల్త్ సహాయకుడు

ఉంగుటూరు: మండలంలో సుమారు 70 వేల మంది జనాభాకు పరిపడ వైద్య సేవలు అందడం లేదు. మండలంలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. చేబ్రోలులో ఒకటి, కాగుపాడులో ఒక పీహెచ్‌సీ ఉన్నాయి. వాటిలో అరకొర వైద్య సేవలు ప్రజలకు అందుతున్నాయి. వాటితో ప్రజలు కాలక్షేపం చేస్తున్నారు. కుక్క కాటుకు, పాము కాటుకు వైద్య సేవలు పూర్తి స్థాయిలో పొందలేకపోతున్నారు. ఈ రెండిటి వైద్యం కోసం తాడేపల్లిగూడెం, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రులకు తరలి వెళ్లాల్సి వస్తోంది. హైరిస్కు ప్రెగ్నెన్సీకి ఇక పడరాని పాట్లు పడాల్సిందే. వేరే ఆసుపత్రులకు ప్రజలు పరుగులు తీయాల్సిందే. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయాల్లో ప్రత్యేక స్పెషలిస్టులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు ముగ్గురు వచ్చేవారు. వారితో వైద్య సేవలు పొందేవారు. ఇపుడు కూటమి ప్రభుత్వంలో స్పెషలిస్టు పోస్టులు తొలగించారు. దీంతో ప్రత్యేక వైద్య సేవలు (స్పెషలిస్టు) పొందలేకపోతున్నారు. అలాంటి సేవలు దొరకాలంటే 50 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఏలూరు, 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాల్సిందే. ప్రధానమైన డాక్టర్‌కు తనకున్న ప్రైవేట్ వైద్యశాలను చూసుకొని ఉదయం 11 గంటలకు కూడా విధులకు రావడం లేదు. ఆసుపత్రి పక్కనే చెత్తాచెదారం మూడు చోట్ల వేయడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. డ్రెస్సింగ్ కోసం వచ్చిన పేషెంట్లు ఆసుపత్రి బయట వికలాంగుల కోసం వేసిన షెడ్డు వద్ద చాలా సేపు నిరీక్షణ చేయాల్సి వస్తోంది. కాగుపాడులో హెల్త్ విజిటర్ పోస్టు ఖాళీగా ఉంది. కొన్ని రకాల మందుల కొరత కూడా ఉంది. దీంతో పూర్తి స్థాయిలో వైద్య సేవలు ప్రజలు పొందలేని పరిస్థితి నెలకొని ఉంది. 108 వాహనం సేవలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన రీతిలో కూటమి ప్రభుత్వం అందించలేకపోతుంది.

అప్‌గ్రేడ్ చేసేదెప్పుడో?

గణపవరం: సుమారు 30 గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించే గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలన్న ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయని పలువురు విమర్శిస్తున్నారు. ఫార్మాసిస్ట్ పోస్టు మూడు సంవత్సరాలుగా ఖాళీగా ఉంది. రోజూ 150 మంది వరకూ అవుట్ పేషెంట్లు వచ్చి ఇక్కడ వైద్య సేవలు పొందుతుంటారు. అయితే పది రోజులుగా ఆసుపత్రిలో మందులు నిండుకున్నాయి. దీంతో రోగులు ఆసుపత్రి వైపు రావడం తగ్గించేశారు. కనీసం అవసరాలకు ఉపయోగపడే జ్వరం, తలనొప్పి, కడుపునొప్పి వంటి సాధారణ ఆరోగ్య సమస్యలకు కూడా మందులు లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు.

పిప్పర పీహెచ్‌సీలో ఒకరే డాక్టర్

మండలంలో మరో ప్రధాన కేంద్రమైన పిప్పర పీహెచ్‌సీలో ప్రస్తుతం ఒక్కరే డాక్టర్ విధులు నిర్వహిస్తున్నారు. మరో డాక్టర్ పోస్టు నెలల తరబడి ఖాళీగా ఉంది. అలాగే సీహెచ్‌వో, పీహెచ్‌ఎన్ పోస్టులు ఖాళీగానే ఉండటంతో సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగిపోయింది. పిప్పర పరిసర 20 గ్రామాలకు ఈపీహెచ్‌సీ వైద్య సేవలందిస్తుంది. రోజూ 100 మంది వరకూ అవుట్ పేషెంట్లుగా ఇక్కడ వైద్య సేవలు పొందుతున్నారు. ఈ ఆసుపత్రిలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

యూరియా మితంగా వాడాలి


యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

దెందులూరు: వరి సాగులో యూరియా అధికంగా వాడితే భూసారం తగ్గటమే కాకుండా నల్లగా వస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం దెందులూరు సచివాలయం-2 పరిధిలో రైతులకు పొలం పిలుస్తోంది నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులు ఉద్యోగులు సూచనలు సలహాలు పరిగణలోకి తీసుకుని భూసారం నష్టం వాటిల్లకుండా తక్కువ మోతాదులో యూరియా వాడాలన్నారు. గ్రామ స్థాయిలో ఉన్న వ్యవసాయ సిబ్బంది సలహాలను, సేవలను పొందాలని రైతులకు అవగాహన కల్పించారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ


జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దెందులూరు: ప్రతి ఒక్కరూ జాతీయ భావం కలిగి ఉండాలని దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వడ్లపట్ల విజయకుమార్, ఉపాధ్యాయురాలు కల్యాణి అన్నారు. మంగళవారం దెందులూరుతో పాటు పలు గ్రామాల్లో పాఠశాలల విద్యార్థులు, నాయకులు జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహించారు.

పీఎంశ్రీ పనుల పరిశీలన


పీఎంశ్రీ పనులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

దెందులూరు: కొవ్వలి ఉన్నత పాఠశాల ప్లస్‌లో మంగళవారం జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి పీఎంశ్రీ పనులను పరిశీలించారు. ఉన్నత పాఠశాల ప్లస్ హెచ్‌ఎం ఎస్ శర్మ పాఠశాల ఉపాధ్యాయులను ప్రత్యేక తరగతుల నిర్వహణ వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి జాన్‌బాబు, ఎండీఎం, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో మాలలకు అన్యాయం

గణపవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో మాలలకు తీరని అన్యాయం జరుగుతుందని మాల మహానాడు జాతీయాధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. మంగళవారం గణపవరం మండలం పిప్పరలో మాల మహానాడు నియోజకవర్గ సమావేశం ఎం.నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో అచ్చిబాబు, జైపాల్, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో ఆసుపత్రికి అనారోగ్యం

- వైద్యుల కొరత, వసతులు అందక రోగుల ఆగచాట్లు
- 8 మంది వైద్యులకు గాను ముగ్గురే విధుల నిర్వహణ
- చుట్టూ ప్రహరీ లేక ప్రాంగణంలో చేరుతున్న వర్షపు నీరు


డాక్టర్ వద్దకు వెళ్లేందుకు క్యూ కట్టిన రోగులు


డాక్టర్ లేకపోవడంతో ఖాళీగా ఉన్న పాత ఓపీ బ్లాక్

భీమడోలు: సామాజిక ఆరోగ్యం కేంద్రంలో సమస్యలు తిష్ట వేశాయి. సర్కారీ దవాఖానాల్లో వైద్యుల కొరత, వసతులు అందక రోగులు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. వైద్యుల కొరతతో దిక్కుతోచని స్థితిలో కొందరు ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. వారికి కాసుల వర్షం కురిపిస్తుంది. దీంతో పేదవారికి వైద్యం అందని ద్రాక్షలా మారింది. ఆ నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇక్కడ ఆసుపత్రిని నిర్మించగా ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో సుమారు రూ.2 కోట్ల రూపాయలతో ఓపీ(అవుట్ పెషెంట్ల) బ్లాక్‌ను నిర్మించి అధునాతన మిషన్లు ఏర్పాటు చేశారు. రోగికి సంబంధించిన అన్ని రకాల పరీక్షలు ఒకే రిపోర్ట్‌లో వచ్చేలా మిషన్‌ను ఏర్పాటు చేశారు. వైద్యులను పూర్తి స్థాయిలో నియమించారు. కానీ నేడు ఆ పరిస్థితులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోగులు ఫుల్.. వైద్యులు నిల్

నియోజకవర్గంలోనే పెద్దాసుపత్రిగా పిలువబడే భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, దెందులూరు, నల్లజర్ల మండలాల్లోని 50 గ్రామాల నుంచి రోగులు వస్తుంటారు. ప్రతి రోజూ 200 మందికి పైగా రోగులు పలు అనారోగ్య కారణాలతో ఆసుపత్రికి వైద్యం నిమిత్తం వస్తున్నారు. సాక్షి విజిట్ సమయానికి 92 మంది రోగులు వచ్చారు. ఎక్కువ సేపు నిలబడడంతో వారు నానా అవస్థలు పడ్డారు. ఆసుపత్రిలోని రోగులను చూసేందుకు ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉండడంతో రోగులకు ఇబ్బందులు తప్పలేదు. అయితే ఇక్కడ 8 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా వారిలో ముగ్గురు వైద్యులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వారిలో ఒకరు జనరల్ ఫిజీషియన్, ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు ఉన్నారు. వారిలో ప్రతి రోజూ ఒకరు రాత్రిపూట వైద్యం చేయడంతో ఇక పగలు ఉండేది ఇద్దరే. దీంతో రోగులు మధ్యాహ్నం వరకు వేచి ఉండాల్సి వస్తోంది. నర్స్‌లు, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్లతో అలా నెట్టుకొస్తున్నారు.

ఆసుపత్రి పరిసరాలు అధ్వాన్నం

భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం పల్లంగా ఉండి, చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో చిన్నపాటి వర్షానికి మురుగు నీరు లోపల చేరుతుంది. దీంతో దోమల వ్యాప్తి అధికంగా ఉంటుంది. ఇన్ పెషెంట్లు దోమలతో నరకయాతనను అనుభవిస్తున్నారు. జనరేటర్ మరమ్మతులకు గురవడంతో రాత్రుళ్లు కరెంటు పోతే ఇన్ పేషెంట్లు జాగారమే. దీనితో రోగులకు చేసేందుకు వచ్చే వారు రోగాల బారిన పడుతున్నారు. రాత్రి సమయాల్లో ఆకతాయిల బెడద ఎక్కువగా ఉండడంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. మందుబాబుల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. దీనితో వైద్యులు, వైద్య సిబ్బంది విధులు నిర్వహించాలంటేనే భయపడిపోతున్నారు.

తీవ్ర జ్వరం ఉన్నా ఎక్కువ సేపు నిలబడాల్సిందే



ఆసుపత్రికి పూర్తి స్థాయి వైద్యులు లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నాం. నా భార్య రెండు రోజులుగా 102 డిగ్రీల జ్వరంతో బాధపడుతుంది. ఉదయం 9.15 గంటలకే ఆసుపత్రికి వచ్చాం. ఇద్దరు వైద్యుల్లో ఒకరు ఇన్ పెషెంట్లను పరిశీలించేందుకు వెళ్లారు. దీంతో ఒక వైద్యురాలే చూడాల్సి వస్తోంది. దీంతో రోగులు క్యూ కట్టారు. ఖాళీ వైద్యుల పోస్టులను భర్తీ చేయాలి.
– టి.శివ, రోగి భర్త, భీమడోలు

రెండు నెలలుగా దగ్గుతో బాధపడుతున్నాను



రెండు నెలలుగా దగ్గు తగ్గడం లేదు. రాత్రి పూట ఎక్కువగా బాధపడుతున్నాను. దీంతో ఉదయాన్నే ఆసుపత్రికి వచ్చాను. పరీక్షలు చేస్తున్నారు. డాక్టర్లు సరిపడా లేకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. రోగుల తాకిడి ఎక్కువగా ఉంది. అందుకు తగిన సిబ్బంది ఉంటే బాగుండేది.
– ఎస్.సుబ్బారావు, రోగి, పంగిడిగూడెం, ద్వారకాతిరుమల

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం


రంగనాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు

భీమడోలు: గ్రంథాలయ శాస్త్రాభివృద్ధికి, గ్రంథాలయ పితామహుడు, పద్మశ్రీ ఎస్ఆర్ రంగనాథన్ చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో మంగళవారం రంగనాథన్ జయంతిని నిర్వహించారు. భీమడోలులో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన బాలబాలికలు, పాఠకులు, పాల్గొని రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమాల్లో గ్రంథపాలకులు కె.శ్రీనివాస్, డీఎన్‌బీ అమర్‌నాథ్, బంగారు పాప, మహిళా కానిస్టేబుల్ లక్ష్మీ సుజనా, కడగల సత్యనారాయణ, సూర్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ఉన్నత స్థానానికి ఎదగడానికి మంచి ఉద్యోగాలు సాధించేందుకు ఉపయోగపడతాయని పలువురు వక్తలు అన్నారు. నారాయణపురం ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. గంథాలయ శాస్త్ర పితామహుడు రంగనాథన్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ రెడ్డియ్య, గ్రంథాలయ ఇన్‌చార్జి రామెహన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నఎస్సై

పెదపాడు: వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని పెదపాడు ఎస్సై కట్టా శారదాసతీష్ తెలిపారు. పెదపాడు మండలంలోని కలపర్రు టోల్ ప్లాజా వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులకు హెల్మెట్ ధరించడం వద్ద కలిగే ప్రయోజనాలను వివరించారు. చిన్న చిన్న తప్పులే పెను ప్రమాదాలకు దారి తీస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పెదపాడు పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఏ-1 పరీక్షలు తనిఖీ

పెదపాడు: మండలంలో నిర్వహిస్తున్న ఫార్మేటివ్-1 పరీక్షలను పెదపాడు ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అసెస్‌మెంట్ పుస్తకాలను ఎమ్మార్సీ నుంచి తీసుకోవాలని సూచించారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం


ఉంగుటూరు: కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి


దెందులూరు: డీ వార్మింగ్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

భీమడోలు: ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన పిల్లల్లో నులిపురుగుల నివారణ ద్వారానే సాధ్యమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ శోభ అన్నారు. పూళ్ల గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని డీఐవో పరిశీలించారు. చిన్నారులకు మాత్రలను మింగించారు. పూళ్ల పీహెచ్‌సీ పరిధిలోని 3462 మందికి మాత్రలు వేయాల్సి ఉండగా వారిలో 3420 మందికి మాత్రలు వేశామని, మిగిలిన వారికి ఈ నెల 20వ తేదీన వేస్తామన్నారు. కార్యక్రమాల్లో పూళ్ల, గుండుగొలను వైద్యాధికారిణులు డాక్టర్ అరుణజ్యోతి, డాక్టర్ జాహ్నవి, సీహెచ్‌వో ఇందిరా, డెప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మధుసూధనరావు, హెచ్‌ఎం పాశం పాండురంగారావు, ఎంపీహెచ్ఈవో వైవీ లక్ష్మణరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్‌బెండజోల్ మాత్రలను తప్పక వేసుకోవాలి

గణపవరం: విద్యార్థులు ఆరోగ్యం కోసం ప్రతి ఆరు నెలలకు తప్పనిసరిగా ఆల్‌బెండజోల్ మాత్రలు వేసుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఓంకార్‌నాథ్‌చ కిరణ్మయి అన్నారు. అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లోనూ విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేశారు. సరిపల్లె పాఠశాలల్లో ఎంపిడివో బేబీ శ్రీలక్ష్మి, పిప్పరలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఐ.శ్రీదివ్య, కాశిపాడులో పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్లు, గణపవరం డిగ్రీకాలేజీలో ప్రిన్సిపల్ నిర్మలకుమారి తదితరులు విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. మండల వ్యాప్తంగా 5250 మంది 18 ఏళ్లలోపు వయస్సు ఉన్న పిల్లలు ఉండగా మంగళవారం 4990 మందికి మాత్రలు వేశామని వైద్యాధికారి తెలిపారు.

నారాయణపురం హైస్కూల్‌లో..

ఉంగుటూరు: నారాయణపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లోనూ, అంగన్ వాడీ కేంద్రాలల్లో నులిపురుగు (ఆల్‌బెండజోల్) మాత్రలు అందజేసే కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునిజేషన్ అధికారి డా. శోభ పర్యవేక్షించారు. మంగళవారం ఈ మేరకు ప్రతి ఒక్కరూ ఆల్‌బెండ్‌జోల్ మాత్రలు వేయించుకోవాలని డాక్టర్ శోభ సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శశి భూషణం, సూపర్ వైజర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన

దెందులూరు: ప్రభుత్వ పాఠశాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో నేషనల్ డీ వార్మింగ్ డే సందర్భంగా విద్యార్థులకు సీహెచ్‌ఓ వినయ్ అవగాహన కల్పించారు. నులిపురుగులను ఆల్బెండజోల్ ద్వారా నివారించొచ్చని, విద్యార్థులు ఈ విషయంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

రక్తదానంతో ప్రాణ దానం


డిగ్రీ కాలేజీలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

గణపవరం: రక్తదానంతో మరొకరికి ప్రాణ దానం చేయొచ్చని, విద్యార్థి దశ నుంచి రక్త దానంపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మల కుమారి అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్‌ఎస్‌ఎస్, రెడ్ క్రాస్ సంస్థల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 20 మంది ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్త దానం వలన ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వరూపరాణి, రెడ్‌క్రాస్ సంస్థ పీఆర్‌వో రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీ సందర్శించిన ఆర్‌జేడీ

గణపవరం: చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఉన్నత విద్య ఆర్‌జేడీ పీవీ కృష్ణయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాల నిర్వహణ, రికార్డులు, అడ్మిషన్లు, కోర్సుల వివరాలను ఆయన పరిశీలించారు. కళాశాలలో వసతి, ల్యాబ్‌ల నిర్వహణ, కంప్యూటర్ గదులను పరిశీలించారు. కళాశాల ఆవరణలో పచ్చదనం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిర్మలకుమారి, వైస్ ప్రిన్సిపల్ స్వరూపరాణి,అధ్యాపకులు పాల్గొన్నారు.

కురుమల మద్దతుకు కృషి


కార్యక్రమంలో పాల్గొన్న కురుమల సంఘ నేతలు

దెందులూరు: ఏలూరు జిల్లాలోని దెందులూరు, చింతలపూడి, ఏలూరు, కైకలూరు నియోజకవర్గాలో ఉన్న 50 వేల మంది కురుమల మద్దతు వైఎస్సార్ సీపీకి అందించేందుకు కృషి చేస్తున్నట్లు కురుమల సంఘ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ తెలిపారు. ఈమేరకు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదుగురు సూర్యనారాయణకు బాధ్యతలు అప్పగించామన్నారు. మంగళవారం రామకృష్ణ పార్టీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, చింతలపూడి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజులను కలిశారు.

ఇంటర్ విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

గణపవరం: చింతలపాటి బాపిరాజు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న 90 మంది విద్యార్థులకు రూ.70 వేల విలువ చేసే యూనిఫామ్‌లను గణపవరానికి చెందిన పేరిచర్ల శింగరాజు, వెంకటసుబ్బాయమ్మ మెమోరియల్ ట్రస్ తరఫున మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గణపవరం సొసైటీ అధ్యక్షుడు కూసంపూడిసురేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుతున్న పేద విద్యార్థుల చదువుకు దాతల సహకారం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాస గౌడ్, అబ్బాయిరాజు, సుబ్బరాజు, శివనాగరాజు, కాపారం చిన్న, పల్లి వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాగి వైరు చోరీపై కేసు నమోదు

పెదవేగి: గుర్తు తెలియని వ్యక్తులు తన పొలంలో ట్రాన్స్‌ఫార్మ్‌లోని రాగి వైరును చోరీ చేసినట్లు ఓ రైతు పోలీసులను ఆశ్రయించాడు. పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామంలోని ఆలపాటి సాంబశివరావు అనే రైతు పొలంలో 11వ తేదీ రాత్రి ట్రాన్స్‌ఫార్మ్‌ను పగులగొట్టి అందులోని రాగి వైరును దొంగిలించినట్లు, దాని విలువ రూ.15 వేలు ఉంటుందని పెదవేగి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెదవేగి: వేగంగా వస్తున్న మోటారు సైకిల్ ఎదురుగా వచ్చి ఢీ కొట్టడంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. 10వ తేదీన జరిగిన ఈ ఘటనపై పెదవేగి ఎస్సై కె.రామకృష్ణ మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా.. పెదవేగి గ్రామానికి చెందిన బెల్లపు సురేష్ పెదవేగి నుంచి కూచింపూడి వెళ్లి అదే రోజు రాత్రి మోటారు సైకిల్‌పై తిరిగి వస్తుండగా ఎదురుగా మరో ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అటుగా వెళుతున్న ప్రయాణికులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పొంచి ఉన్న కార్పొరేట్ ప్రమాదం

గణపవరం: ప్రాచీన చరిత్ర కలిగిన నాయీ బ్రాహ్మణుల వృత్తి మనుగడకు కార్పొరేట్ సంస్థల నుంచి ప్రమాదం పొంచి ఉందని, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాడికొండ నర్సింహారావు అన్నారు. మంగళవారం గణపవరంలోని కన్యకా పరమేశ్వరి వర్తక సంఘ భవనంలో పశ్చిమగోదావరి జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నర్సింహారావు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం ఉందని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయీ బ్రాహ్మణులకు నెలకు 150 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందించారన్నారు. పట్నాల గణపతి, రామకృష్ణ పాల్గొన్నారు.